క్లుప్తంగా

శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో నిఘా



డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న ఎస్ఐ సురేష్‌బాబు

పాములపాడు: చట్ట విరుద్ధ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకే డ్రోన్ కెమెరాతో శివారు ప్రాంతాల్లో నిఘా ఉంచామని ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు. ఆదివారం మండలంలోని కంబాలపల్లి, ఎర్రగూడూరు, రుద్రవరం గ్రామాల శివారు ప్రాంతాలను డ్రోన్ కెమెరాతో పరిశీలించారు. పాములపాడు శివారు ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు బహిరంగంగా మద్యం సేవిస్తుండటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. అలాగే పోలీసుస్టేషన్ సమీపంలో కేజీ రోడ్డుపై వాహనాల తనిఖీలు చేపట్టారు. నిబంధనలు అతిక్రమించిన వారి నుంచి అపరాధ రుసుము వసూలు చేశారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

చెంచు గిరిజనులకు ఉపాధి బిల్లులు చెల్లించండి



చెంచు గిరిజనులతో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఆత్మకూరు: మండలంలోని చెంచు, గిరిజన గూడాల్లో ఉపాధి పనులు చేసిన చెంచు గిరిజనులకు వెంటనే బిల్లులను చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహనాయక్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని ఇందిరేశ్వరం చెంచు గూడేన్ని ఆదివారం సందర్శించారు. వారు మాట్లాడుతూ చెంచుగిరిజనులు జాతీయ గ్రామీణ ఉపాధి పనులు చేసి నాలుగు వారాలైనా నేటికీ బిల్లులు రాలేదన్నారు. దీంతో వారు నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు నగదు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో గిరిజనులు రాజమ్మ, నాగన్న, నాగమ్మ, సీరమ్మ, చిన్నమ్మ, గౌరవయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

నందికొట్కూరు: ఎంసీపీఐ(యూ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు లాజరస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జయసూర్య చేతుల మీదుగా జిల్లా మహాసభల పోస్టర్లను విడుదల చేయించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ అడుగు జాడలో పాలన సాగించడం తదగన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగసంస్థలను అప్పజెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. వచ్చే నెల 27, 28 తేదీల్లో కర్నూలు నగరంలోని అంబేడ్కర్ భవనంలో జరిగే జిల్లా మహాసభలకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దక్క చిన్నకుమార్, మద్దిస్వామి, శ్రీనివాసులు, సవ్య, తదితరులు పాల్గొన్నారు.

కరివేన సత్రం అభివృద్ధే లక్ష్యం

శ్రీశైలం: కరివేన సత్రం అభివృద్ధే లక్ష్యమని నిర్వాహకులు, ఒలెక్ట్రా విద్యుత్ బస్సుల సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీ ప్రదీప్ తెలిపారు. శ్రీశైల మహా క్షేత్రంలో అఖిలభారత కరివేన బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం వార్షిక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కరివేన సత్రం స్థాపించి 135 సంవత్సరాలు అయ్యిందన్నారు. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కరివేన సత్రాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సత్రం అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ వేణుగోపాల్, కోశాధికారి హరినాథ్ రావు, గౌరవ అధ్యక్షులు కామరాజు, నరేంద్రులు మాట్లాడుతూ సత్రం ఆధ్వర్యంలో 4 ప్రధాన ప్రాజెక్టులు చేపట్టేందుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీశైలంలో రెండో బ్లాక్, అరుణాచలం, భద్రాచలంలో సత్రాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. అలాగే తిరుపతి, అయోధ్యలో కూడా సత్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించారు. కరివేన సత్రాలలో పనిచేసే 15 బ్రాంచ్‌ల సిబ్బందికి వారి జీతాలను పెంచి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): కబడ్డీ సబ్ జూనియర్ ఉమ్మడి జిల్లా స్థాయి బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు శ్రీవెంకటేశ్వర విద్యామందిర్ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఏపీరెడ్డి తెలిపారు. 34వ సబ్ జూనియర్ బాలుర, బాలికల పోటీలను కాశిరెడ్డినాయన ఆశ్రమ నిర్వాహకులు శివశంకర్‌రెడ్డి, మల్లికార్జు నరెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. నంద్యాల జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెనాగరాజు పాల్గొన్నారు.

జొన్న రైతు దిగాలు!

ఆరుగాలం శ్రమించే రైతన్నలకు కాలం కలిసి రావడం లేదు. పంట సాగుకు చేసిన పెట్టుబడి కూడా రాక అప్పుల్లో కూరుకుపోతున్నారు. జొన్న రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వచ్చిన అరకొర దిగుబడులకు ధర లేక దిగులు చెందుతున్నారు. మద్దతు ధర కల్పించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు అడిగిన ధరకు అమ్మాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

- తగ్గిన దిగుబడులు
- కరువైన మద్దతు ధర
- కానరాని కొనుగోలు కేంద్రాలు
- చోద్యం చూస్తున్న సర్కారు





ధర లేకపోవడంతో కల్లాలోనే జొన్న దిగుబడులు

ఆత్మకూరు: ఈ ఏడాది రబీలో రైతులు అత్యధికంగా జొన్న పంట సాగుచేశారు. జిల్లాలోనే ఆత్మకూరు డివిజన్‌లో ఈ పంట సాగు ఎక్కువ చేస్తారు. ఈ సారి ఆత్మకూరు మండలంలో 150 హెక్టార్లు, వెలుగోడు మండలంలో 2 వేల హెక్టార్లు, పాములపాడు మండలంలో 1600 హెక్టార్లు, కొత్తపల్లి మండలంలో 1400 హెక్టార్లలో రైతులు మహీంద్ర రకం జొన్న పంటను సాగుచేశారు. అయితే, వాతావరణం అనుకూలించకపోవడంతో ఈసారి వారి ఆశలు ఆవిరయ్యాయి. ఆశించిన మేర దిగుబడులు రాకపోగా మార్కెట్‌లో ధర కూడా లేదు. దీంతో రైతులు బయట ప్రైవేట్ వ్యాపారులకు నష్టానికి విక్రయించుకోలేక దిగుబడులను ఇళ్లల్లో, కల్లాల్లో నిల్వ చేశారు. గతంలో ఎకరా జొన్న పంటకు 20–25 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈసారి 15 నుంచి 18 క్వింటాళ్లకే పరిమితమైంది. పంట సాగు, ఎరువులు, మందులు, కోత తదితర వాటికే ఎకరాకు రూ. 20 వేల నుంచి 25 వేల వరకు ఖర్చు అయ్యిందని, మార్కెట్‌లో చూస్తే ధర లేదని రైతులు వాపోతున్నారు.

దిక్కుతోచని పరిస్థితి

గతంలోఎప్పుడూ లేని విధంగా జొన్న రైతులు పంటను అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నారు. మద్దతు ధరతో పంట కొనుగోలు చేసి ఆదుకోవాల్సిన కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు. దీనిని అదునుగా చేసుకున్న వ్యాపారులు, దళారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. క్వింటం రూ.2500 లోపే అడుగుతుండటంతో నష్టాలు మూటకట్టుకోవాల్సి వస్తుందని రైతుల ఆందోళన చెందుతున్నారు. గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకుందామంటే అప్పటి వరకు పంటలను నిల్వ చేసుకునేందుకు అవసరమైన గోడౌన్లు లేవని వాపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ?

కేంద్ర ప్రభుత్వం జొన్నకు మద్దతు ధర రూ.3,371గా ప్రకటించింది. అయితే, జిల్లాలో ఎక్కడా ఈధరకు కొనుగోలు జరగడం లేదు. ఇప్పటి వరకు సర్కారు కొనుగోలు కేంద్రాలు సైతం ఏర్పాటు చేయలేదు. కేవలం వ్యవసాయాధికారులు ఈకేవైసీ, ఈ పంట నమోదు, విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ పైనే దృష్టి పెడుతున్నారు తప్ప జొన్న కొనుగోలు కేంద్రాల గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సర్కారు ఇప్పటికైనా స్పందించి ఆత్మకూరు ప్రాంతంలో మార్క్‌ఫెడ్, సివిల్ సప్లై ద్వారా జొన్న పంట కొనుగోలుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అండగా నిలిచిన గత ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలబడేది. విత్తనం పంపిణీ మొదలు ధాన్య కొనుగోలు వరకు సర్కారే చేపట్టేది. దీంతో రైతులకు ఇబ్బంది ఉండేది కాదు. పండించిన పంటను స్థానిక ఆర్‌బీకేలో నమోదు చేయిస్తే చాలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జొన్న క్వింటం ధర రూ.3,180 పలికిందని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆ ధర లేదు..కొనుగోలు కేంద్రాలు లేవని వాపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



నేను పది ఎకరాల్లో జొన్న పంట సాగుచేశాను. వచ్చిన దిగుబడిని అమ్ముకుందామంటే గిట్టుబాటు ధర లేదు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. క్వింటం రూ.3,371 చొప్పున కొనుగోలు చేసి ఆదుకోవాలి. లేకపోతే మేము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. – దేశం తిరుపంరెడ్డి, రేగడగూడూరు, వెలుగోడు మండలం

జొన్నరైతులను ఆదుకోవాలి



మా ప్రాంతంలో ఎక్కువగా రబీలో మహీంద్ర జొన్న పంట సాగుచేస్తాం. ఈసారి కూడా అలాగే వేశాం. అయితే, గతంలో మాదిరిగా ఈసారి దిగుబడులు రాలేదు. దీనికితోడు ధర కూడా లేదు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాం. గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తే నష్టాల నుంచి బయట పడతాం. సర్కారు స్పందించి ఆదుకోవాలి.

– సిద్దయ్య, వెలుగోడు

బానుముక్కలలో కార్డెన్ సెర్చ్



ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

పాములపాడు: మండలంలోని బానుముక్కల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, పాములపాడు ఎస్ఐ సురేష్‌బాబుల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రత్యేక పోలీసు బలగాలతో గ్రామంలోని వీధుల్లో పర్యటించారు. గతంలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ముద్దాయిలు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లలో సోదాలు నిర్వహించారు. రికార్డులు లేని 11 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో సీఐ మాట్లాడుతూ యువత మద్యం, గంజాయి, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల గురించి వివరిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం



మంటల్లో కాలిపోతున్న పూరి గుడిసె

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ పంచాయతీ మజరా కోల్స్ ఆనందాపురం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో పూరి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఆవర్ల అనే వ్యక్తి తమ కుటుంబ సభ్యులతో ప్రార్థన కోసం చర్చికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో నుంచి మంటలు చెలరేగాయి. మధ్యాహ్నం సమయం కావడం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో మంటలు ఆర్పేందుకు వీలు పడలేదు. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, బట్టలు, ఇంటి ముందు ఉన్న ద్విచక్రవాహనం దగ్ధమయ్యాయి. సుమారు రూ.2లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు వాపోయాడు. కట్టుబట్టలు మినహా ఏమి మిగలకపోవడంతో దీనస్థితిలో ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసి బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అనుభవంలోని భూములకు పరిహారం ఇవ్వాలి



సింగరాజుపల్లె గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కొత్తపల్లి: ఎన్‌హెచ్ 167–కేలో నిర్మాణంలో కోల్పోతున్న రైతుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్. స్వాములు, గుమ్మడాపురం సర్పంచ్ నక్కా విజయ్ కుమార్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పాతమాడుగుల, ఎర్రమఠం, సింగరాజుపల్లి గ్రామాల్లో పర్యటించి జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న రైతులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ గతంలో ఆర్డీఓ, తహసీల్దార్, రెవెన్యూ అధికారులు అనుభవంలో ఉండి భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు ఆన్‌లైన్‌తో సంబంధం లేకుండా నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పారన్నారు. ఇప్పుడేమో ప్రభుత్వ భూములకు నష్టపరిహారం ఇవ్వలేమనడం రైతులను మోసం చేయడమే అని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు ఆన్‌లైన్‌లో ఉన్న తప్పులను సరిచేసి రైతుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకు నష్టపరిహారం చెల్లించాలని లేకపోతే బాధిత రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత రైతులు పులికంటి పెద్ద నారాయణ, గంగేశ్వరుడు, చిన్న వెంకటస్వామి, పెద్ద వెంకటస్వామి, వేదమూర్తి, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

డోర్లు, కిటికీల అక్రమ నిల్వపై చర్యలు తీసుకోవాలి



పాడుపడిన భవనంలో నిల్వచేసిన వస్తువులను చూపుతున్న సీపీఐ నాయకుడు రమేష్



భవనంలో నిల్వచేసిన డోర్లు, కిటికీలు

జూపాడుబంగ్లా: జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న, నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇవ్వాల్సిన డోర్లు (కడపమాన్లు), కిటికీలను పాడుపడిన భవనంలో అక్రమంగా నిల్వచేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకొని వాటిని లబ్ధిదారులకు అందేలా చేయాలని సీపీఐ నాయకుడు రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఇసుక, సిమెంటు, కడ్డీలు, ఇంటి డోర్లు(కడపమాను), కిటికీలు అందజేసిందన్నారు. వాటిని హౌసింగ్ అధికారులు ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అందజేయాల్సి ఉంది. అయితే లబ్ధిదారులకు ఇవ్వకుండా జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయం వెనుక పాడుపడి ముళ్లకంపల మధ్యనున్న భవనంలో అక్రమంగా నిల్వచేయటం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. జగనన్నకాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిన వస్తువులను వారికి సక్రమంగా అందజేయకుండా అక్రమాలకు పాల్పడిన వారిపై సమగ్రవిచారణ జరిగి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై హౌసింగ్ ఏఈ జ్యోతిని వివరణ కోరగా జూపాడుబంగ్లా మండలంలో 170 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోగా వారిలో 103 మందికి కడపమాన్లు, కిటికీలు మంజూరైనట్లు తెలిపారు. కొంత మంది లబ్ధిదారులు వాటిని తీసుకెళ్లలేదన్నారు. మంజూరైన వాటిని నిల్వచేసేందుకు భవనాన్ని అద్దెకు తీసుకుంటే నెలకు రూ.800ల నుంచి రూ.1,000లు చెల్లించాల్సి వస్తుందని, అందుకే ఎంపీడీఓ కార్యాలయం వెనుక పాడుపడిన భవనంలో వస్తువులను భద్రపర్చినట్లు తెలిపారు. వెంటనే వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటం

నందికొట్కూరు: ప్రజా సమస్యలపై పోరాడేందుకు సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో భారత కార్మిక సంఘాల సమైక్య(ఐఎఫ్‌టీయూ) అనుబంధ సంఘం ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గుర్తింపు స్టిక్కర్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విప్లవ కార్మిక సంఘం ఏర్పడినప్పటి నుంచి ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. ఆటో కార్మికుల సమస్యలపై కలిసికట్టుగా ఉండి ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియ్యా, రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, ఆటో యూనియన్ నాయకులు జాకీర్, ఉస్మాన్, పుల్లయ్య, రమేష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తే ప్రోత్సాహకాలు

కొత్తపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలను విశ్రాంత తహసీల్దార్ పెసల జనార్దన్ అందజేస్తారని దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణమోహన్ ఆదివారం తెలిపారు. ఆయన తండ్రి పెసల లక్ష్మయ్య జ్ఞాపకార్థం ప్రతి ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.5వేలు, ద్వితీయ స్థానం రూ.3వేలు, తృతియ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.2వేలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది నుంచి తన జీవిత కాలం ఈ ప్రోత్సహకాలను అందజేస్తానని ప్రకటించారన్నారు.

సమస్యలపై అర్జీలు ఇవ్వండి

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు.

బ్రాహ్మణులకు చట్టసభల్లో స్థానం కల్పించాలి

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్రంలోని బ్రాహ్మణులకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ కూటమి ప్రభుత్వాన్ని ఆదివారం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బ్రాహ్మణ జనాభా 4 శాతం ఉన్నప్పటికీ ప్రస్తుత శాసన సభలో బ్రాహ్మణులకు ప్రాతినిథ్యం లేదన్నారు. ఇప్పటికైనా శాసనమండలిలో బ్రాహ్మణులకు అవకాశమివ్వాలని కోరారు.

సమాన హక్కుల కోసం ఉద్యమించండి

నంద్యాల(న్యూటౌన్): మహిళలకు గౌరవంగా జీవించే హక్కు ఒకరిచ్చేది కాదని, మన హక్కు అని.. మహిళలకు రక్షణగా ఎన్ని చట్టాలు ఉన్నా నిరుపయోగంగానే ఉంటున్నాయని, సమాన హక్కుల కోసం ఉద్యమించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి నంద్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. దుర్గా భవానీ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై దాడులు పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. డాక్టర్ అరిఫా భాను, ఏపీ మహిళా సమాఖ్య నాయకులు సుశీలమ్మ, సరళమ్మ, అలిమా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ.. ఘణపురం రోడ్డు గుర్తుకు రాలేదా..?



మట్టిరోడ్డు కంటే అధ్వానంగా మారిన ఎం. ఘణపురం బీటీ రోడ్డు

పగిడ్యాల: మండలంలోని ఎం.ఘణపురం, ఎస్.ఘణపురం గ్రామాలకు వెళ్లే బీటీ రహదారి గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గుంతలు ఏర్పడిన రహదారిపై ప్రయాణం చేయడానికి ఆయా గ్రామస్తుల ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ వాహనదారులు అనునిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఇటీవలే నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావిస్తూ.. నందికొట్కూరు నుంచి పగిడ్యాల వరకు 10 కి.మీ. వరకు డబుల్ లైన్ బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరడం తెలిసిందే. అయితే అధ్వానంగా తయారైన ఎం, ఎస్. ఘణపురం గ్రామాల రోడ్డు ఎమ్మెల్యేకు గుర్తుకు రాలేదా అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలకు గ్రామ పంచాయతీ ఖర్చుతోనే బిలుకు వేయించగా.. ప్రస్తుతం మట్టిరోడ్డును తలిపించేలా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేగారు స్పందించి ఎం, ఎస్. ఘణపురం గ్రామాల బీటీ రోడ్డుకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి



ఆర్యవైశ్యులకు గ్రైండర్లు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు భవనాసి వాసు

వెలుగోడు: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రథమ అధ్యక్షుడు భవనాసి మహేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో ఆర్యవైశ్యులకు గ్రైండర్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ భవనాసి వెంకటసుబ్బయ్య శెట్టి, వెంకమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా 35 గ్రైండర్లు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులకు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గొడుగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అన్నివేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. చదువుకునే నిరుపేద ఆర్యవైశ్యులకు ఆర్థికంగా సహకారమందిస్తున్నామన్నారు. అలాగే పదో తరగతి పరీక్ష విద్యార్థులకు రోజు ఒక స్కూలులో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తామన్నారు. వెలుగోడు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో మూడు గ్రైండర్లు, రెండు కుట్టు మిషన్లు, ఒక తోపుడు బండి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బల్లాని వెంకట సత్యనారాయణ, లాలం నాగార్జున, నాగేళ్ల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, వేణుగోపాల్, బొగ్గరపు లక్ష్మీనారాయణ, హరిబాబు, తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్, లాలం మల్లికార్జున, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఆత్మకూరు: నంద్యాల పట్టణంలో ఈనెల 12వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువతను దగా చేస్తోందన్నారు. దీనికి నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో యువతపోరు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. నంద్యాల పట్టణంలోని ఉదయానంద రెసిడెన్షియల్ పాఠశాల నుంచి ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జి శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈనెల 12వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండలాధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేయడంతో పాటు స్వీట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి పెద్ద ఎత్తున చేరుకుని పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు



దొంగ అరెస్టు చూపుతున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



రికవరీ చేసిన బంగారు అభరణాలు

నందికొట్కూరు: పట్టణంలోని కుర్వ పేటలో సాయికొండ శ్రీనివాసులు ఇంట్లో బంగారు అభరణాల చోరీ కేసులో దొంగను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని టౌన్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. ఎస్ఐ సురేష్‌బాబును, పోలీసులను పట్టణ సమీపంలోని మార్కెట్ యార్డు వద్ద చూసి పారిపోతున్న చుక్కబొట్ల ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా దొంగతనం చేసిన విషయం బయటపడిందన్నారు. ప్రవీణ్ వద్ద ఉన్న ఒక బంగారు గొలుసు, జత చెవి కమ్మలు, వాటి చెవి చుట్లు, ఒక జత చెంప చారలు, లాంగ్ చైన్ స్వాధీనం చేసుకున్నారమని చెప్పారు. వీటి విలువ రూ.2.40 లక్షలు ఉంటుందని, రికవరీ చేసిన ఎస్ఐని, క్రైమ్ పార్టీ సిబ్బందిని అభినందించారు. నిందితులు గతంలో గొర్రెలు, మేకపోతులు దొంగలించిన కేసులో ముద్దాయిగా ఉన్నారని సీఐ చెప్పారు. వీరిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

అక్రమంగా లేఅవుట్లు...యథేచ్ఛగా విక్రయాలు



మండ్లెం బ్రహ్మంగారి మఠం వెనుకనున్న పొలంలో వేసిన లేఅవుట్

- గ్రామపంచాయతీ అనుమతి, ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే లేఅవుట్లు
- చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్న పంచాయతీ, రెవెన్యూ అధికారులు
- ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న రియల్టర్లు



విక్రయించిన ప్లాట్ల చుట్టూ పాతిన రాళ్లు

జూపాడుబంగ్లా: గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారుల అనుమతుల్లేకుండా అక్రమంగా లేఅవుట్లు వేసి యథేచ్ఛగా ప్లాట్లను విక్రయిస్తున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవటంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండ్లెం గ్రామపంచాయతీ, రెవెన్యూ పరిధిలోని బ్రహ్మంగారి మఠం వెనుకనున్న పొలం, రోడ్డు పక్కన హైవేను ఆనుకొని ఉన్న పొలాల్లో ల్యాండ్ కన్వర్షన్, పంచాయతీ అనుమతుల్లేకుండా కొందరు అక్రమంగా లేవుట్ వేశారు. సెంటు రూ.2.50లక్షల నుంచి రూ.3.50లక్షల వరకు విక్రయిస్తూ పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు. వాస్తవానికి గ్రామపంచాయతీకి నిర్ణీత రుసుమును చెల్లించి అనుమతి పొందిన తర్వాత రెవెన్యూ అధికారుల సహకారంతో ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అలాంటివేవి లేకుండా అక్రమంగా పంటపొలాల్లో లేవుటు వేసి ప్లాట్లను విక్రయించి సొమ్ముచేసుకుంటూ వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ ను వివరణ కోరగా తాను వచ్చిన తర్వాత ఎవరికీ ఎలాంటి ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు ఇవ్వలేదన్నారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకొంటామన్నారు.